


వెన్నెల్లో తాజ్ మహలా మెరిసి హోటల్.
పోతోంది ప్యారడైజ్ లాన్స్‌లో అక్కడక్కడా

కూర్చున్న జంటలు-కబుర్లు చెప్పుకుంటూ, గుసగుసలాడుకునే గువ్వల్లా కనిపిస్తున్నాయి.

లాన్స్ మధ్యలో పౌంటెన్ విరజిమ్మే నీళ్ళు—ముత్యాల్లా ఎగిరి పడుతున్నాయి.

తన కాటేజీ వరండాలో కూర్చుని కోల్డ్ బీర్ సిప్ చేస్తూ, జీడిపప్పు నంజుకుంటూ, అసహనంగా అటూ ఇటూ కదుల్తూ, మాటి మాటికీ తనవాచీ చూసుకుంటున్నాడు నాగరాజు.

కాసేపటికి హోటల్ బాయ్ తన వెంట ఎవర్నో వెంట బెట్టుకుని వస్తున్న దృశ్యం చూసి,అతని కళ్ళు మెరిశాయి.

"ఇతనేనా?" ప్రశ్నించాడు నాగరాజు.

తెల్లటి యూనిఫారంలో వున్న బాయ్ అవునన్నట్లు తల వూపాడు.

నాగరాజు జేబులో నుంచి పది కాగితం తీసి బాయ్ చేతికి అందించాడు. బాయ్ సెల్యూట్ చేసి బొమ్మలా నిల్చొండిపోయాడు.

"నువ్వెళ్ళు. కావాలంటే పిలుస్తా!" అన్నాడు నాగరాజు.

బాయ్ వెళ్ళిపోయాడు.

నాగరాజు అతన్ని పరీక్షగా చూశాడు.

ఆ వచ్చినతనికి దాదాపు పాతికేళ్ళుంటాయి. నీటుగానే వున్నాడు. హిప్పీ క్రాపు, చేతిని ఎలక్ట్రానిక్ వాచీ, ఫుల్ బూటు. చూసే వాళ్ళు ఎవరో స్టూడెంట్ అనుకుంటారు గానీ, అటువంటి వాడని అనుకోరు.

"నీ పేరు?"

"ఏడు కొండలు." నవ్వాడు అతను.

"కూర్చో."

"ఫరవాలేదు సార్!" మళ్ళీ నవ్వాడు ఏడుకొండలు.

మనిషి నల్లగా వుండడం వల్ల అతను నవ్వినప్పుడు పళ్ళు బైట పడి తెల్లగా మెరుస్తున్నాయి.

అవి చూసి నాగరాజుకి నవ్వొచ్చింది.

"కూర్చో! మొఖమాటం ఎందుకు? ఫర్వాలేదు—కూర్చో!" బలవంతం చేశాడు నాగరాజు.

టీపాయ్ మీద వున్న గ్లాసులో బీరుపోసి, "తీసుకో!" అన్నాడు నాగరాజు.

ఏడుకొండలు ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి చూశాడు.

నాగరాజు చాలా అమాయకుడిలా కనిపించాడు అతని కళ్ళకి. ఎంతో మంచి వాడిలా వున్నాడని అనుకున్నాడు. అదే ఎవరైనా అయితే, తన నొక పురుగుని చూసినట్లు చూస్తారు. తొందరగా తమ

పని అయ్యేట్లు తరిమేస్తారు. అంతే కాని ఇంత మర్యాదగా చూడరు. ముక్కూ మొఖం తెలియక పోయినా, తమ నౌకర్ని పిలిపినట్లే 'అరేయ్, ఒరేయ్' అని పిలుస్తారు.

"తీసుకోవయ్యా! చల్లదనం తగ్గిపోతుంది" అని హెచ్చరించాడు.

ఏడుకొండలికి తీసుకోక తప్ప లేదు.

నెమ్మదిగా అసలు విషయం కదలేశాడు నాగరాజు.

"ఈ వూళ్ళో ఏ. బి. పి. డి. కాలేజీ వుంది కదూ?"

తల వూపాడు ఏడుకొండలు.

"ఎవరైనా కాలేజీ స్టూడెంట్స్ వున్నారా?" మత్తుగా నవ్వాడు నాగరాజు.

"ఉన్నారు కాని, హోటల్స్‌కి రారు సార్! వాళ్ళతో చాలా కష్టం సార్! వాళ్ళకి అవసరం వున్నప్పుడే వస్తారు. మనకి అవసరం వున్నప్పుడు దొరకరు" అన్నాడు ఏడుకొండలు.

నాగరాజు మాట్లాడలేదు.

"ఏదో అందరికీ కాలేజీ స్టూడెంట్స్ అంటే మోజుగాని, వాళ్ళని మించిన అందగత్తెలు వున్నారు సార్! సినీస్టారులు కూడా పనికి రారు సార్! వెరీ బ్యూటీస్ సార్!" ఏడు కొండలు పొగడసాగాడు.

"ఏ. బి. పి. డి. కాలేజీలో ఎవరైనా అమ్మాయి వుంటే చూడు! హోటల్‌కి రానక్కరలేదు. పైగా ఎంత కావాలన్నా ఇస్తాను."

ఏడుకొండలు అనుకున్నాడు— 'ఎవరి పిచ్చి వాళ్ళకి ఆనందం' అని.

"కమల అని ఒకమ్మాయి వుంది సార్! కాని ఏమంత పర్స నాల్టీ కాదు సార్! చామన ఛాయగా వుంటుంది. మీకు నచ్చుతుందో...."

ఏడుకొండలు మాటలకు అడ్డు వస్తూ, "నచ్చుతుంది" అన్నాడు నాగరాజు.

ఏడుకొండలు ఆశ్చర్యంగా చూసి, 'వీడికేదో పిచ్చి' అను కున్నాడు.

"వెళ్ళి మాట్లాడు. ఈ హోటల్‌కి రానక్కర్లేదు. నేనే వస్తాను" అన్నాడు సంతోషంతో.

* * *

"కాలేజీకి దూరం కాదా-ఇంత దూరంలో వున్నావు?" అన్నాడు నాగరాజు.

"దూరంగా వుంటేనే మంచి దని. ఈ లొకాల్టీ నాకు అను కూలంగా వుంది. నన్ను ఎవరూ పట్టించుకోరు" అంది కమల నవ్వుతూ.

నాగరాజు కమలను నఖశిఖ పర్యంతం చూశాడు.

వయస్సులో వుంది కాబట్టి ఫరవాలేదు, ఆకర్షణీయంగా కనిపిస్తోంది—మేకప్ మీద. నీలిరంగు చీరలో ఆమె శరీరపు వంపులన్నీ స్పష్టంగా కనిపిస్తూ కవ్విస్తున్నాయి అతన్ని.

"ఏం చదువుతున్నావు?"

"బి. యస్సీ."

"నీ కెవరూ లేరా?"

"లేరు. ఏదో స్కాలర్ షిప్‌ల మీద చదువుతున్నాను. ఎందుకు ఇవన్నీ అడుగుతున్నారు? మీరేమైనా రచయితలా?" ముఖం చిట్లించి ప్రశ్నించింది కమల.

"కాదు."

"నా గురించి మీ కెందుకు వివరాలు? త్వరగా వెళ్ళిపోవడానికి ప్రయత్నించండి" అంటూ మంచం మీద కూర్చున్న నాగరాజు ప్రక్కనే కూర్చుంది.

"ఈ రాత్రి నిన్ను అనుభవించడానికి రాలేదు నేను." సీరియస్‌గా అన్నాడు నాగరాజు.

అదిరిపడింది కమల.

ఆశ్చర్యంతో చూపింది నాగరాజుని.

"నువ్వొక ముఖ్యమైన పని చెయ్యాలి. సక్సెస్ అయితే నీ జాతకమే మారిపోతుంది. నువ్వు డబ్బు కోసం శరీరాన్ని అమ్ముకోవాల్సిన పని లేదు. నువ్వు డాక్టర్ కోర్స్ చదవడానికి ఏర్పాటు చేస్తాను."

సంబరంతో ఆమె గుండె వేగంగా కొట్టుకుంది.

"ఏం చెయ్యాలి నేను?" సన్నగా వుంది ఆమె గొంతు. ఆనందంతో మాటలు రావడంలేదు. శరీరం గాలిలో తేలిపోతున్నట్లుగా ఫీలైంది.

"మీ కాలేజీలో రమేష్‌బాబు అని ఒకడున్నాడు తెలుసా?"

కమల కాసేపు ఆలోచించి, "తెలుసు. కాని....నాకు పరిచయం లేదు" అంది.

"అక్కర్లేదు. వాడి పని పట్టాలి నువ్వు."

"అంటే—చంపాలా ఏం?" కంగారుగా ప్రశ్నించింది.

"నో-నో. అటువంటిదేమీ అక్కర్లేదు. చంపినంత పని.... బ్రతికుండగానే చంపినంత పని." పకపక నవ్వాడు నాగరాజు.

కమలకు ఏమీ అర్థం కావడం లేదు. 'ఈ నాగరాజు ఎవరు? ఆ రమేష్‌ని ఏదో చెయ్యాలంటాడేమిటి? ఏం చెయ్యాలి? అది మరెవరూ చెయ్యలేనిదా? తనే

చెయ్యాలా? అందుకు ప్రతిఫలంగా తనను డాక్టర్ని చేస్తారా? ఏమిటి దంతా?' కమల బుర్ర గిర్రున తిరుగుతోంది.

"నువ్వేమీ భయపడకు. నీ మీద ఈగ వాలనివ్వను. 'ధైర్యే సాహసే లక్ష్మీ' అన్నారు-తెలుసు గదా! ఈ చిన్న పని ధైర్యంతో చేశావంటే-చాలు! నీ జీవితం హాయిగా దర్జాగా గడిచిపోతుంది." నాగరాజు ఆశలు కల్పిస్తున్నాడు ఏవేవో.

"ఏం చెయ్యాలో చెప్పరేం?" అసహనంగా అంది కమల.

"తొందర పడకు__చెప్తాగా!" నవ్వుతూ అన్నాడు నాగరాజు,

* * *

గాంధీ చౌక్ సెంటర్లో ఫ్రెండ్స్‌తో నిల్చుని కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ, తుళ్ళుతూ సరదాగా వున్నాడు రమేష్‌బాబు.

ఆ వూళ్ళో గాంధీ చౌక్ పెద్ద సెంటర్. హోటళ్ళు, ఫ్యాన్సీ స్టోర్లు, చెప్పుల షాపులు, కిళ్ళీకొట్లు అన్నీ అక్కడే వున్నాయి. సెలవుల్లో ఇళ్ళ కొచ్చిన కుర్రాళ్ళు కాలక్షేపం చేసేది కూడా ఆ సెంటర్లోనే.

అప్పుడు సాయంకాలం నాలుగైంది.

సూర్యుడు పశ్చిమ దిక్కుకి దిగుతున్నాడు నెమ్మది- నెమ్మదిగా.

రమేష్‌బాబు చుట్టూ పదిమంది కుర్రాళ్ళున్నారు. అంతా అతని ఈడు వాళ్ళే. అంతా టౌనుల్లో చదువుకుంటూ సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చారు.

వాళ్ళతో మాట్లాడుతూ....

మాట్లాడుతూనే, ఎర్రటి జిప్ బ్యాగ్ పట్టుకుని వస్తూ వున్న కమలని చూసి, క'లా? నిజమా?' అనుకున్నాడు రమేష్‌బాబు.

గుడ్లప్పగించి ఆమె వంక చూస్తున్న రమేష్‌ని చూసి అంతా ఆశ్చర్యపోయారు.

'ఎవరు?' అనే ప్రశ్న అందరి బుర్రల్లోనూ ఉదయించింది.

కమల వాళ్ళకు పది అడుగుల దూరంలో ఆగిపోయింది.

"రమేష్!" నెమ్మదిగా అంది.

రమేష్ ఆమె వైపు అడుగులు వేస్తూ, 'కమలకు ఎవరైనా చుట్టా లున్నారా ఈ వూళ్ళో?' అనుకున్నాడు.

"కొంప మునిగింది రమేష్!" ఆమెకు ఏడుపు ముంచుకొచ్చింది.

"ఏం జరిగింది?" అనేశాడు రమేష్.

"ఏం జరగాలో అదే జరిగింది. నాకు నెల తప్పింది రమేష్! భయం వేసి నిన్ను వెతుక్కుంటూ

వచ్చాను." ఆమె గట్టిగానే అతని స్నేహితులకు వినపడేటట్లే అంది.

రమేష్‌కి బుర్ర పని చెయ్యలేదు కాసేపు. అసలు అతనికి కమలతో పరిచయమే లేదు. ఒకే కాలేజీ కాబట్టి ముఖ పరిచయం వుంది. 'ఇదేమిటి-తనకి నెల తప్పిందని వచ్చింది? ఎందుకు తప్పింది? ఎవరు అతను? అయినా తను ఏంచేస్తాడు? అసలు తన కోసం ఎందుకొచ్చింది?'

రమేష్ తల గిర్రున తిరిగి పోతూ వుంది. ఈ లోపల అతని స్నేహితులు వాళ్ళ దగ్గరికి వచ్చారు. వాళ్ళకి కేసు అర్థమైంది. 'ఓర్నీ! భలే రసికుడే' అనుకున్నారు. 'అప్పుడే కడుపులు చేసేవరకూ వచ్చాడన్న మాట!' నవ్వుకున్నారు.

"హీరో అయ్యావన్న మాట!" ఎవరో అన్నారు.

అంతా పక్కన నవ్వుతుంటే రమేష్ ఉలిక్కి పడ్డాడు. అతనికి కోపం ముంచుకొచ్చింది.

"ఏమిటి ఇదంతా? నన్నేం చెయ్యమంటావు? అసలు ఈ వూరు ఎందుకొచ్చావు?" కమలని గబగబా అడిగేశాడు రమేష్.

కమల భోరున ఏడ్చింది. వెక్కి వెక్కి ఏడ్చింది. ఆ సెంటర్లో జనం ఒక్కరొక్కరే పోగయ్యారు. ఒక ఆడపిల్ల హృదయ విదారకంగా ఏడుస్తుంటే ఎవరికైనా జాలి కలుగుతుంది గదా!

"నాకు తెలుసు రమేష్, నువ్విలా అంటావని. నేను భయ పడినట్లేజరిగింది. ప్రేమ...ప్రేమని నా వెంటపడి, తీరా నాకు గర్భం వచ్చేసరికిప్లేటుఫిరాయిస్తావా? నన్ను అన్యాయం చేస్తావా?" ఏడుస్తూనే అంటోంది కమల.

అతని స్నేహితులు మూగ వాళ్ళలా చూస్తుండిపోయారు. ఏం చేయాలో వాళ్ళకి అర్థం కావడం లేదు. జనం వినోదంగా టిక్కెట్టు లేని నాటకం చూస్తున్నట్లుగా చూసి ఆనందిస్తున్నారు.

రమేష్‌కి అదంతా అర్థం కావడం లేదు. 'కమల ఏమిటి ఇలా వాగుతోంది...ఏడుస్తోంది.... దీనికేమైనా పిచ్చెక్కలేదు గదా! పిచ్చే... దీనికి పిచ్చెక్కి వచ్చింది. లేకపోతే తనేమిటి- ఈ దరిద్రపు మొఖాన్ని ప్రేమించడం ఏమిటి? ఛీ.... దీన్ని ప్రేమించాడా తను___ ఇంక ఎవరూ దొరకనట్లు!'

"నోర్మూయ్! నీ కేమైనా మతి పోయిందా? నేను నిన్ను ప్రేమించానా? గర్భవతివి అయ్యావా? ఎవరైనా నవ్వుతారు." పిచ్చెక్కినట్లు గట్టిగా కోపంతో జేవురించిన ముఖంతో అన్నాడు రమేష్.

"నవ్వుతూనే వున్నారు నా కర్మ చూసి. నన్ను చూసి నువ్వూ నవ్వు. చూడండయ్యా! రమేష్ నన్ను ఎంత అన్యాయం చేస్తు న్నాడో! కాలేజీలో నా వెంట పడ్డాడు ప్రేమిస్తున్నానని. నేను మొదటే వద్దన్నాను. మాది తక్కువ కులం, పైగా డబ్బులేని దాన్ని అని ఒప్పుకోలేదు. 'ఈ రోజుల్లో కులాలేమిటి?' అని పెద్ద లెక్చరిచ్చాడు. పెళ్ళి చేసుకుంటా నని నమ్మించి గొంతు కోశాడు. ఇప్పుడు చెప్పండి అయ్యలారా! నా కడుపులో పెరుగుతున్న పాపాన్ని ఏం చెయ్యను? పొట్ట కోసి చంపనా? లేకపోతే నేనే ఏ నుయ్యో- గొయ్యో చూసుకోనా?" కమల హృదయ విదారకంగా ఏడుస్తోంది.

జనం గుంపుగా చేరారు రమేష్‌కి వూపిరాడ్డం లేదు. వుక్కిరి బిక్కిరై పోయాడు. ఎవరో గొంతు పిసుకుతున్నట్లు నోటంట మాటలు రావడం లేదు. తన తలలో నరాలు చిట్లిపోయి చచ్చిపోతానేమో అనుకున్నాడు.

కమల ఏడుపు అందర్నీ ఆకట్టు కుంటోంది.

ఎవరు కబురు మోసుకెళ్ళారో గాని, రమేష్ తండ్రి రాఘవయ్య కారులో వచ్చాడు.

కొడుకు తన పరువు బజార్లో

---


# విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 42 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 21 రూ॥ |
| విడి ప్రతి | 3-50 రూ॥ |

పడేసి నందుకు ఆయనకి కోపం ముంచు కొచ్చింది.

"ఇదేం పనిరా ఛండాలుడా! నా కడుపున చెడపుట్టావురా!" అని మండి పడ్డాడు.

"నాకేం తెలియదు నాన్నా!" అతి కష్టం మీద అనగలిగాడు.

"ఏం తెలియదూ? ఆ అమ్మాయి ఎవరు? మీ కాలేజీయేనా?"

"ఆఁ...మా కాలేజీయే!"

రాఘవయ్య తల అవమాన భారంతో వంగిపోయింది. 'వీడేదో బుద్ధిగా చదువు కుంటాడని కాలేజీలో చేరిస్తే, టౌన్‌లో వీడు కులం తక్కువ దాన్ని ప్రేమించి కడుపు చేసి....ఛీ...ఛీ...'

కమల ఏడుస్తూ తిడుతోంది. "పైకి అంతా కులాలు లేవంటారు. పెళ్ళి చేసుకోమనే సరికి కులాలు అడ్డం వస్తాయి."

"నువ్వు వూరుకో అమ్మాయ్!" రాఘవయ్య అన్నాడు.

"ఎలా వూరుకోను? మీకేం తెలుసు నా బాధ. మీరు మాలాగా కులం తక్కువ వాళ్ళైతే. మీ అమ్మాయిని ఎక్కువ కులం వాడు కడుపు చేసి మోసం చేస్తే తెలిసేది మీకు ఆ బాధ...."

"తొందర పడకమ్మా! నిదానంగా ఆలోచిద్దాం."

"ఏమిటండీ ఆలోచించేది? ఇదుగో వూరి పెద్దలంతా ఇక్కడే వున్నారు. వీళ్ళ ముందు చెప్పండి-నన్ను మీ ఇంటి కోడలుగా చేసు కుంటారా-లేదా?"

రాఘవయ్యకి గొంతు పెగల్లేదు.

రమేష్‌కి కడుపు మండి పోతూ ఉంది. తలలో అగ్ని పర్వతం బ్రద్దలైంది.

"నోర్ముయ్! అసలు నువ్వెవరివో నాకు తెలియదు. నీకూ నాకూ ఏమీ సంబంధం లేదు. నేను నిన్ను పెళ్ళి చేసుకోను. ఫో....ఫో...నీకుదిక్కున్న చోటికి ఫో! నీకు చేతనైంది చేసుకో! పద నాన్నా!" అంటూ తండ్రి చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళి పోయాడు రమేష్ పూనకం పూనిన వాడిలా.

కమల తెలివి తప్పి పడి పోయింది.

ఎవరో చేతులలో మోసుకెళ్ళి రిక్షాలో కూర్చోబెట్టారు.

* * *

రోజూ తెల్లవారినట్లే ఆ రోజూ తెల్లవారింది.

కాని సూర్య కిరణాలతో పాటు కమల అనే అమ్మాయిని ఎవరో హత్యచేసి పంట కాలువ ఒడ్డున పడేశారనే వార్త ఇంటింటికీ ప్రసరించింది.

పోలీసులు రమేష్‌ని అరెస్ట్ చేశారు. బెయిల్ మీద వదిలిపెట్టారు తర్వాత.

కేసు కోర్టులో జరుగుతుంది.

ప్రతి ఎన్నికలలోనూ ఎమ్.ఎల్.ఏ.గా పెద్ద మెజార్టీతో గెలుస్తూ వస్తున్న రాఘవయ్య ఈసారి ఓడిపోయాడు.

సుబ్బరాజు సునాయాసంగా గెల్చాడు.

* * *

సుబ్బరాజు గెల్చిన రోజు, అతను నాగరాజుని అమాంతం కౌగలించుకున్నాడు.

"నువ్వు పెద్ద నాటకం ఆడి ఆ కులం ఓట్లన్నీ రాఘవయ్యకి పడకుండా చేశావుగాని, లేకపోతే నేను ఈసారీ ఓడిపోయేవాడిని. ఇందతా నీ గొప్పతనమే!" ఆనందాశ్రువులు రాలుస్తూ అన్నాడు సుబ్బరాజు.

"నా దేముంది? అంతా దేవుడి దయ" వినమ్రుడై తలవంచి అన్నాడు. సుబ్బరాజు నమ్మినబంటు నాగరాజు. *

## రచయితలకు మనవి

'విజయ'లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరు వారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే నిరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగుతుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి ప్రయోజనముండదు. 'బాపు అభిమానుల పేజీ'లో పాల్గొనే పాఠకులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా :

ఎడిటర్,

'విజయ'

80-ధనలక్ష్మి కాలనీ,

మద్రాసు-600 026.